## 35 సంవత్సరాలకు దొరికిన రింగ్

పోయిన వస్తువులు దొరకడం అన్నది చాలా అరుదుగా జరుగుతుంది. అదీ బంగారం వస్తువులైతే చెప్పనక్కర్లేదు. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప పోయిన వస్తువు దొరకదు అన్నది చాలా మందిలో ఉన్న ప్రగాఢ విశ్వాసం. విశ్వాసమే కాదు నిజం కూడా. అలాంటిది సుమారు మూడున్నర దశాబ్దాల కిందట పోయిన బంగారు ఉంగరం దొరకడం అంటే మామూలు విషయం కాదు. అద్భుతమే! ఇలాంటి అద్భుతం ఇటీవల జరిగింది. చాపెల్‌లో ఓ ఇంటి గచ్చుపగుళ్లలో కెరీస్ విలియమ్స్ అనే బ్రిటీష్ మహిళ తనకి ఎంతో ఇష్టమైన బంగారు ఉంగరాన్ని పోగొట్టుకుంది. అప్పట్లో ఎంత వెదికినా ఆ ఉంగరం దొరకలేదు. ఆ ఉంగరం మీద విలియమ్స్ ఆశలు వదులుకుంది. సంవత్సరాలు గడిచినా విలియమ్స్ తనకెంతో ఇష్టమైన ఆ ఉంగరాన్ని మరిచిపోలేకపోయింది. చివరికి 35 సంవత్సరాల తరువాత ఆ ఉంగరం విలియమ్స్ చేతికి తిరిగి వచ్చింది. ఇటీవల ఆమె చాపెల్ వెళ్లింది. ఇంటిని కూలగొట్టి బాగుచేసారన్న సంగతి తెలుసుకొని ఇంటి పనిలో పాల్గొన్న కూలీలను కలుసుకొని తన ఉంగరం గురించి వాకబు చేసింది. కూలీలు ఆ ఉంగరాన్ని ఆమెకు తిరిగి ఇచ్చేశారు. విలియమ్స్ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. పోయిన ఉంగరం ఇన్ని సంవత్సరాల తరువాత కూడా దొరకడం అన్నది నిజంగా వింతే!

## స్పోర్ట్స్ సర్వే



ఆకాశంలో తాము సగం అంటూ పురుషులతో సమానంగా స్త్రీలు దూసుకుపోతున్నారు. ఆటలూ, పాటలు, అలంకరణ ఇలా ఎన్నో రంగాలలో తమకంటూ గుర్తింపును, ప్రత్యేకతను వారు సంపాదించుకున్నారు. ఒకే రంగంలో జీవితాంతం ఉండిపోవాలని ఈనాటి స్త్రీ భావించడంలేదు. అవకాశం ఇస్తే తమకిష్టమైన అన్ని రంగాలలో ప్రవేశించాలని భావిస్తోంది. వృత్తి, ప్రవృత్తి వేరయినా పెద్దగా పట్టించుకోవడం లేదు. అభిరుచే ప్రధానంగా ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో యూరప్‌లో హెయిర్ డ్రయర్స్‌గా ఉండే మహిళల్ని స్పోర్ట్స్‌పై వాళ్ల అభిప్రాయాన్ని సేకరించారు. వారిలో 50శాతం మంది స్పోర్ట్స్ అంటే ఇష్టమని అవకాశం ఉంటే స్పోర్ట్స్‌లోకి రావాలనుకుంటున్నట్టు తెలిపారు. దీంతో అక్కడి ప్రభుత్వం ఒక మిలియన్ ప్రజలు స్పోర్ట్స్‌కి దగ్గరయ్యేలా 2012 సంవత్సరానికల్లా చూస్తామని ప్రకటించింది. ఇకపోతే ఏ శాతంలో స్త్రీలు ఆటల్ని అభిమానిస్తున్నారంటే...

- 40శాతం యువతులు వాళ్ల శరీర దృఢత్వంపై ఆత్మవిశ్వాసంతో ఉన్నారు.
- 25శాతం అమ్మాయిలు ఆటలు ఆడటం మంచిదనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.
- 61శాతం మంది మహిళలు వారి కుటుంబం తమ దగ్గర లేకుండా శారీరకంగా వారు కష్టబడటానికి ఇష్టపడట్లేదు.
- 80శాతం మహిళలు క్రీడలు, షాపింగ్ కంటే ఎక్కువ ఆనందాన్ని ఇస్తుందని నమ్ముతున్నారు.

## 'సరసి' కత

వైశంపాయనుడు బస్సుస్టాండులో కాస్త అసింటా అనుమానాస్పదంగా చేతులు వెనక్కి పెట్టుకుని నిలబడ్డ వ్యక్తి వంక తదేకంగా చూడసాగాడు. అతని చేతికి దొంగలకు వేసే బేడీ కనిపించింది. తన అనుమానం నిజమైందని నిర్ధారించుకుని, బాధ్యతగల ఒక పౌరుడిగా ధైర్యంతో ముందుకు వెళ్లి అతడి చొక్కా పట్టుకున్నాడు. ''రాస్కెల్, ఎక్కడ నుంచి తప్పించుకొస్తున్నావురా? చేతికి ఆ బేడీలేవిటి?''అని గట్టిగా అరిచాడు వైశంపాయనుడు.

అనుమానాస్పదంగా కనిపిస్తున్న వ్యక్తి ఒక్క క్షణం కంగుతిన్నా, క్షణంలో తేరుకుని, ఫక్కున నవ్వేశాడు. ''పోండి సార్. ఇది బేడీ అనుకుంటున్నారా? పప్పులో కాలేసారు. ఇది లేటెస్ట్ ఫ్యాషన్ 'ఫ్రెండ్‌షిప్ బ్యాండ్'!కొత్తగా వస్తోంది. అచ్చు బేడీలాగానే వుంటుంది. చదువుకున్న వాళ్లు మీరే పొరబాటు పడితే ఎట్లాసార్'' అన్నాడు. తనని

### చదువుకున్నవాడు



చదువుకున్న వాడిగా గుర్తించినందుకు, కృతజ్ఞతగా అతడి చొక్కా వదిలేశాడు వైశంపాయనుడు. ''మీరు చూడలేదేమో, చాలా మంది వేసుకుంటున్నారీ మధ్య. ఎవర్ని చూపించనూ?''అంటూ అటూ ఇటూ వెదికి, కాస్తంత దూరంలో చేతులు ముడుచుకుని ఎటో చూస్తూ వెళ్లిపోబోతున్న ఓ వ్యక్తిని పిలిచాడు అనుమానాస్పద వ్యక్తి.

''బ్రదర్, మిమ్మల్నే! ఒక్కసారిలా రండి. ఏదీ, మీ చేతికున్న ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ సార్‌కి చూపించండి''అన్నాడు. అతని చేతికి కూడా ఒక బేడీ, దానికి వేలాడుతూ గొలుసు ముక్క వున్నాయి! వైశంపాయనుడు నాలిక్కరుచుకున్నాడు. వెంటనే 'సారీ' చెప్పి ఇద్దరికీ చేతులు కలిపాడు. వాళ్లు వెళ్లిపోయారు.

ఒక్కోసారి తనలాంటి చదువుకున్నవాళ్లు కూడా ఇలా పొరబాటు పడుతూ వుంటారని, అది సహజమని తనకి తాను సర్ది చెప్పుకున్నాడు వైశంపాయనుడు.

మర్నాడు ఆ 'చదువుకున్న వైశంపాయనుడు' న్యూస్ పేపర్లో వచ్చిన ఓ వార్తని చదువుకున్నాడు–''కోర్టుకు తీసుకువెడుతుండగా తప్పించుకున్న ఇద్దరు నిందితులు! పట్టుకున్న వారికి లక్ష రూపాయల బహుమతి!!''అని.

*